క్లుప్తంగా

శాఖా గ్రంథాలయ చైర్మన్‌గా శ్రీనివాసరావు


శ్రీనివాసరావును సన్మానిస్తున్న దృశ్యం

టి.నరసాపురం : టి.నరసాపురం శాఖాగ్రంథాలయ చైర్మన్‌గా నల్లూరి శ్రీనివాసరావు (ఎఫ్ ఎస్) మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన్ను సొసైటీ చైర్మన్ దేవరపల్లి ముత్తయ్య, పలువురు నాయకులు సన్మానించారు. తనను చైర్మన్‌గా నియమించిన పోలవరం ఎమ్మెల్యే తెల్లం బాలరాజు, జెడ్పీటీసీ సామంతపూడి బాలసూర్యనారాయణరాజు, పార్టీ కన్వీనర్ శ్రీనురాజు, ముత్తయ్య తదితరులకు శ్రీనివాసరావు కృతజ్ఞతలు తెలిపారు. శాఖాగ్రంథాలయ అభివృద్ధికి అందరి సహకారంతో కృషిచేస్తానని అన్నారు. కార్యక్రమంలో పార్టీ మండల యూత్ అధ్యక్షులు గంధం సర్వేశ్వరరావు, మాదంశెట్టి మల్లికార్జునరావు, ఏఎస్సై రెడ్డి, పురం శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

విద్యా కానుక కిట్ల పంపిణీ


విద్యా కానుక కిట్లను అందజేస్తున్న సర్పంచ్ రత్నకుమారి

జంగారెడ్డిగూడెం రూరల్ : మండలంలోని పట్టిన్నపాలెం ప్రభుత్వ పాఠశాలలో మంగళవారం జగనన్న విద్యా కానుక కిట్లను పంపిణీ చేశారు. సర్పంచ్ పసుపులేటి రత్నకుమారి, గృహసారథుల కన్వీనర్ పసుపులేటి నాగార్జునరావు చేతుల మీదుగా కిట్లను అందజేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ రత్నకుమారి మాట్లాడుతూ విద్యార్థుల సంక్షేమానికి ప్రభుత్వం అనేక కార్యక్రమాలను చేబడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నిత్యాన్నదాన ట్రస్టుకు విరాళం

ద్వారకాతిరుమల : శ్రీవారి నిత్యాన్నదాన ట్రస్టుకు ఒక భక్తుడు మంగళవారం రూ.లక్ష విరాళంగా అందజేశారు. విజయవాడకు చెందిన వెలగపూడి శంకర్‌బాబు, శ్రీదేవి దంపతులు ముందుగా స్వామి, అమ్మవార్లను దర్శించారు. అనంతరం ఈ విరాళాన్ని నిత్యాన్నదాన కార్యాలయంలో జమచేశారు. ఈ సందర్భంగా దాత దంపతులకు ఆలయ అధికారులు విరాళం బాండ్ పత్రాన్ని అందించారు.

ఎల్‌టీఆర్ భూములు గిరిజనులకే చెందాలి

బుట్టాయగూడెం : ఎల్‌టీఆర్ భూములు గిరిజనులకే చెందాలని కోరుతూ సీపీఐఎంఎల్ న్యూడెమోక్రసీ చంద్రన్నవర్గం పార్టీకి చెందిన కార్యకర్తలు మంగళవారం బుట్టాయగూడెంలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆ పార్టీ నాయకులు తలారి ప్రకాష్, సాలి రాజశేఖర్, జొన్నకూటి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ బుట్టాయగూడెం రెవెన్యూ పరిధిలో 1/70 చట్టానికి వ్యతిరేకంగా రంపాల రాజు అనే వ్యక్తి ఎల్‌టీఆర్ భూములను అక్రమంగా సాగు చేస్తున్నారని చెప్పారు. ఈ భూముల కోసం అవసరమైతే ప్రతిఘటన పోరాటాలు చేస్తామని అన్నారు. ఆ పార్టీ నాయకులు మడకం రామన్న, సున్నం సోమరాజు, బాబిల్‌రెడ్డి, కాళీ బాబు, సముద్రాల చంద్రరావు, కలింపూడి చంద్రరావు, బోడా ఏసుపాదం, పూనెం పార్వతి, ముక్కక్క, నరసమ్మ, బుల్లెమ్మ, విజయదుర్గ పాల్గొన్నారు.

అజీమ్ చారిటీ చేయూత

చింతలపూడి : పట్టణానికి చెందిన షేక్ ఖాషిం అనే దివ్యాంగుడికి సీతామహాలక్ష్మి స్వచ్ఛంద సంస్థ నిర్వాహకుడు జయవరపు శేఖర్ అందించిన నూతన బ్యాటరీ ట్రైసైకిల్‌ను అజీమ్ చారిటీ ఫౌండర్ ఎస్‌కే ఆజాద్ చేతులమీదుగా అందజేశారు. అలాగే చింతలపూడికి చెందిన శ్రీలక్ష్మీనరసింహా జ్యూయలరీ షాప్ అధినేత నడిపల్లి విద్యాధరరావు ఖాసింకు రూ.3వేలు విలువైన ఎలక్ట్రానిక్ రైస్ కుక్కర్, బియ్యం అందజేశారు.

ప్రతి మంగళవారం అన్నదానం


ఆలయంలో నిర్వహిస్తున్న అన్నసమారాధన

కొయ్యలగూడెం : బయ్యన్నగూడెంలోని శ్రీవల్లి దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయ ప్రాంగణంలో ప్రతి మంగళవారం అన్న సమారాధన కార్యక్రమం నిర్వహిస్తుండడం అభినందనీయమని మండల పరిషత్ ఉపాధ్యక్షులు తుమ్మలపల్లి గంగరాజు పేర్కొన్నారు. ఆలయ ప్రాంగణంలో మంగళవారం మధ్యాహ్నం సేవాదళ్ భక్త బృందం 400 మందికి పైగా భక్తులకు అన్న సమారాధన నిర్వహించారు. వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి వెలగ శ్రీరామమూర్తి, ఉప సర్పంచ్ కోరుకొండ లలితతో కలిసి ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు.

స్వచ్ఛమైన నీటి సరఫరా

ద్వారకాతిరుమల: స్థానిక తూర్పు వీధిలో మంచినీటి బోరుకు మరమ్మతులు పూర్తి కావడంతో మంగళవారం నుంచి ఆ ప్రాంతవాసులకు కుళాయిల ద్వారా స్వచ్ఛమైన తాగునీరు అందుతోందని పంచాయతీ కార్యదర్శి ఎల్.వెంకటేశ్వరరావు తెలిపారు. గ్రామంలోని అన్ని ప్రాంతాల వారికి పుష్కలంగా నీరు అందుతోందన్నారు.

అభివృద్ధికి అడుగడుగునా సైంధవులే

- పోలవరం ఎమ్మెల్యే తెల్లం బాలరాజు
- అంకాలగూడెంలో గడపగడపకు మన ప్రభుత్వం


కొయ్యలగూడెం : అంకాలగూడెంలో ప్రజలతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బాలరాజు


కామవరపుకోట : కొత్తూరులో బ్రోచర్లు అందజేస్తున్న ఎమ్మెల్యే ఎలీజా

కొయ్యలగూడెం : మహాభారతంలో ఒక సైంధవుడు ఉంటే నవభారతంలోనీ మన రాష్ట్రానికి తెలుగుదేశంతో పాటు దానికి వంత పాడుతున్న మిత్రపక్షాలలోని వారు అందరూ అభివృద్ధికి సైంధవులుగా మారారని ఎమ్మెల్యే తెల్లం బాలరాజు పేర్కొన్నారు. మంగళవారం అంకాలగూడెం గ్రామంలో గ్రామ కన్వీనర్ మోపిదేవి వాసు ఆధ్వర్యంలో నిర్వహించిన గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. నాలుగేళ్ల వైఎస్సార్ సీపీ పాలనలో రాష్ట్రంలోని అభివృద్ధిని ఇతర రాష్ట్రాలు ఆదర్శంగా తీసుకుంటుంటే కళ్లు ఉండి కబోదులుగా మారిన కొన్ని రాజకీయ పార్టీలు ఓర్వలేని తనంతో అక్కసు వెళ్లగకుతున్నాయన్నారు. గ్రామ స్థాయి నుంచి పట్టణ స్థాయి వరకు ఏ ప్రదేశానికి వెళ్లినా ప్రజల నుంచి వస్తున్న స్పందన మళ్లీ ముఖ్యమంత్రిగా జగన్‌మోహన్‌రెడ్డిని చూడాలని కోరుకోవడమే అన్నారు. ఏనాడు ఒంటరిగా గెలవలేని చంద్రబాబు మళ్లీ అతుకుల బొంతలను కలుపుకొని పాలనలోకి వద్దామని చూస్తున్నారన్నారు. వచ్చే సార్వత్రిక ఎన్నికల తరువాత టీడీపీకి మనుగడ ఉండబోదు అని చంద్రబాబుకి రాజకీయ సన్యాసం జగన్‌మోహన్‌రెడ్డి కానుకగా అందివ్వబోతున్నారన్నారు. ఈ సందర్భంగా ఇంటింటికి తిరుగుతున్న సమయంలో తమ కుమారుడు పెన్నాడ శేఖర్ హోంగార్డుగా చేస్తూ చిన్నతనంలోనే ప్రాణాలు కోల్పోవడంతో తమ జీవనాధారం కష్టమైందని ఇంటిని కూడా నిర్మించుకోలేకపోయామని తల్లిదండ్రులు వీర్రాజు, ఆలీషమ్మ బాలరాజు వద్ద కన్నీటి పర్యంతమయ్యారు. వారికి వెంటనే జగనన్న ఇల్లు మంజూరు చేయాల్సిందిగా ఆదేశించడంతోపాటు కుటుంబానికి ప్రభుత్వం తరపున అండగా నిలబడతామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఎంపీపీ గంజిమాల రామారావు, సర్పంచ్ కడకట్ల గడ్డియ్య, ఎంపీటీసీ జాన్ డేవిడ్‌కింగ్, మండల కోకన్వీనర్ తాడిగడప రామకృష్ణ, మండల యూత్ ప్రెసిడెంట్ యడ్లపల్లి సురేష్, పార్టీ నాయకులు ధూళిపూడి బాబురావు, ఏలేటి చంద్రం, పోలేశ్వరరావు, మోపిదేవి వాసు, జొన్నకుటి రమేష్, కోటిపల్లి బ్రహ్మం, మద్దిపాటి కిషోర్, వనపర్ల జయరాజు, ఎం.మనోజ్, చల్లా సుబ్బారావు, తదితరులు పాల్గొన్నారు.

జగన్ పాలనలో అన్ని వర్గాలకు సంక్షేమం

కామవరపుకోట : ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పాలనలో కుల మత రాజకీయాలకు అతీతంగా అన్ని వర్గాలకు సంక్షేమ పథకాలు అందుతున్నాయని చింతలపూడి ఎమ్మెల్యే ఉన్నమట్ల ఎలీజా అన్నారు. మంగళవారం మండలంలోని కొత్తూరు గ్రామంలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ప్రతి ఇంటికీ వెళ్లి ప్రభుత్వం అందించిన సంక్షేమ పథకాలను లబ్ధిదారులకు వివరిస్తూ బ్రోచర్లు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత టీడీపీ హయాంలో జన్మభూమి కమిటీల పేరుతో రాష్ట్ర ప్రజలుకు సంక్షేమ పథకాలు అందక అభివృద్ధికి నోచుకోక అల్లాడిపోయారన్నారు. కానీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పరిపాలన చేపట్టిన నాలుగేళ్లలో అర్హతే ప్రామాణికంగా రాష్ట్ర ప్రజలకు నేరుగా ఇంటికి సంక్షేమ పథకాలు అందిస్తూ రాష్ట్ర ప్రజల మన్ననలను పొందుతూ దేశంలోనే అగ్రగామి ముఖ్యమంత్రిగా నిలిచారన్నారు. వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో 175 సీట్లు విజయం సాధించి మరలా వైఎస్ జగన్ సీఎం అవుతారని ధీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్లు మిడతా రమేష్ బాబు, నానాది సాగర్, రాష్ట్ర క్రిస్టియన్ మైనార్టీ ఫైనాన్స్ డైరెక్టర్ పందు జగదీష్, ఎంపీటీసీలు బోల్లు వెంకట సత్యనారాయణ, కో–ఆప్షన్ సభ్యులు ఎస్‌కే కరీముల్లా, గ్రామ సర్పంచ్‌లు కరిపోతు అనూష, దేవరపల్లి రామ్మోహనరావు, వైఎస్సార్‌సీపీ నాయకులు చిలుకూరు సుబ్బారావు, కోటగిరి కిషోర్ బాబు, గుర్రాల రవికుమార్, నల్లూరు ప్రభాకర్ రావు, నాగళ్ళ సీతారాంబాబు, చింతపల్లి సుధా, వెర్రు శ్రీను, ఐతం మహేష్, మల్లెల్లి బాలస్వామి, వైఎస్సార్‌సీపీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

35 సార్లు రక్తదానం


వాసా వెంకటేశ్వరరావు, జంగారెడ్డిగూడెం

జంగారెడ్డిగూడెం : రక్తదానం చేయాలంటేనే వెనుకాడే వ్యక్తులు ఎక్కువగా ఉన్న నేటి కాలంలో 35 సార్లు రక్తదానం చేసి ఆదర్శంగా నిలిచారు వాసా వెంకటేశ్వరరావు. ప్రపంచ రక్తదాతల దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆయన మాట్లాడుతూ క్షతగాత్రులు, తలసేమియా, రక్త అవసరాలు కలిగిన వారు రక్తం కోసం చేసే ప్రయత్నాలు తనను చలించివేశాయన్నారు. రక్తం దొరకని సమయంలో వారు పడే ఆవేదన చూసి తనవంతుగా సహాయం చేయాలనిపించిందని, అప్పటి నుంచి రక్తదానం చేయడం ప్రారంభించినట్లు చెప్పారు. ఇప్పటి వరకు 35 సార్లు రక్తదానం చేసినట్లు తెలిపారు. ఆయన భార్య లలితా శివజ్యోతి సైతం ఈ బృహత్తర కార్యక్రమంలో పాల్గొని 16 సార్లు రక్తదానం చేసినట్లు చెప్పారు.

రాష్ట్రాభివృద్ధికి అహర్నిశలూ శ్రమిస్తున్న సీఎం జగన్


మద్దులగూడెంలో పంచాయతీ భవన నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే తలారి వెంకట్రావు

ద్వారకాతిరుమల: రాష్ట్ర అభివృద్ధికి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నిరంతరం శ్రమిస్తున్నారని గోపాలపురం ఎమ్మెల్యే తలారి వెంకట్రావు అన్నారు. మండలంలోని మద్దులగూడెంలో మండల పరిషత్ నిధులు రూ.13 లక్షలతో గ్రామ పంచాయతీ నూతన భవన నిర్మాణానికి ఆయన మంగళవారం శంకుస్థాపన చేశారు. ముందుగా ఎమ్మెల్యే తలారి శాస్త్రోక్తంగా భూమి పూజను నిర్వహించారు. ఆ తరువాత శంకుస్థాపన శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ తమ ప్రభుత్వానికి సంక్షేమం, అభివృద్ధి రెండు కళ్లని అన్నారు. పేద ప్రజల సంక్షేమంతో పాటు రాష్ట్ర అభివృద్ధికి జగనన్న పాటుబడుతుంటే, అసలు అభివృద్ధే జరగడం లేదంటూ ప్రతిపక్షాలు చేస్తున్న విమర్శలు హాస్యాస్పదంగా ఉన్నాయన్నారు. రాష్ట్రంలో రైతు భరోసా కేంద్రాలు, సచివాలయాలు, విలేజ్ హెల్త్ క్లినిక్ భవనాలతో పాటు, సీసీ రోడ్లు, బోర్లు తదితర నిర్మాణాలు జోరుగా జరుగుతున్నాయన్నారు. ఇప్పటికైనా ప్రతిపక్షాలు కళ్లు తెరచి జరుగుతున్న అభివృద్ధిని చూడాలన్నారు. అన్ని వర్గాల ప్రజలు జగన్ పాలనను కోరుకుంటున్నారని, వచ్చే ఎన్నికల్లో సైతం జగన్‌కు పట్టం కట్టడం ఖాయమన్నారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చెలికాని రాజబాబు, స్థానిక సర్పంచ్ చెలికాని ప్రవీణ్, మండల కన్వీనర్ ప్రతాపనేని వాసు, సొసైటీ చైర్ పర్సన్‌లు చెలికాని సంజయ్, భోగరాజు చిన్ని, గుర్రాల లక్ష్మణ్, సర్పంచ్‌లు పోల్కంపల్లి అనీల్‌కుమార్, మానుకొండ ప్రసాద్, పసుపులేటి ఏసుబాబు, పెద్దిన దిలీప్, ఎంపీటీసీలు పల్లపాటి ధర్మారావు, మానుకొండ కన్నయ్య, యాచమనేని నాగేశ్వరరావు, చెలికాని బుల్లియ్య, మండల కోఆప్షన్ సభ్యుడు షేక్ భాషా, పల్లపాటి ప్రభాకరరావు, కట్టూరి ఇసాకు, గంజి మురళీ, బసివిరెడ్డి వెంకట్రామయ్య, మానుకొండ సుబ్బారావు, దాసరి రాంబాబు, ఉక్కుర్తి వెంకట్రావు, పెద్దిరెడ్డి జ్యోతిశ్రీనివాస్, ఆచంట బన్ను తదితరులున్నారు.

తప్పుడు రాతలు మానుకోవాలని హితవు


వైఎస్సార్ సీపీ సమావేశంలో మాట్లాడుతున్న మండల కన్వీనర్ నాగేశ్వరరావు

కొయ్యలగూడెం : అంపశయ్య మీద ఉన్న టీడీపీని అధికారంలోకి తీసుకురావడానికి అర్రులు చాస్తున్న పచ్చ పత్రికలకు మాదిరిగానే వాటికి కొన్ని తోక పత్రికలు కూడా తయారయ్యాయని వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ గొడ్డటి నాగేశ్వరరావు పేర్కొన్నారు. కొయ్యలగూడెంలో జిల్లా సోషల్ మీడియా కన్వీనర్ చిక్కాల దుర్గాప్రసాద్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన మాజీ ఎంపీపీ మట్ట సత్తిపండు మండల స్థాయి నాయకులతో కలసి పాల్గొన్నారు. టిష్యూ పేపర్లుగా కూడా ఉపయోగించడానికి పనికిరానటువంటి కొన్ని పత్రికలు వచ్చే ఎన్నికలలో ఎమ్మెల్యే తెల్లం బాలరాజు ఓటమి ఖాయం అంటూ తప్పుడు రాతలు రాస్తున్నారని అన్నారు. దీని వెనుక పెద్ద కుటిల రాజకీయ నడుస్తుందన్నారు. ఇటీవల రీజనల్ కోఆర్డినేటర్ ఎంపీ మిధున్ రెడ్డి సైతం తన పర్యటన సందర్భంగా బాలరాజుకే మళ్లీ ఎమ్మెల్యే సీటు అని ప్రచారం చేసిన సంగతి గుర్తుంచుకోవాలన్నారు. ఇది మింగుడు పడని కొందరు వ్యక్తులు అడ్రస్ లేని తోక పత్రికలకు డబ్బులిచ్చి మరీ తప్పుడు రాతలు రాయిస్తున్నారన్నారు. తప్పుడు రాతలు మానుకోవాలని ఆయా పత్రికలకు హితవు పలికారు. వచ్చే ఎన్నికల్లో బాలరాజు మళ్లీ గెలవడం ఖాయం అని, జగనన్నకు అత్యంత ఆప్తుడైన బాలరాజుని మంత్రిగా చూడడం ఖాయమని పేర్కొన్నారు. కార్యక్రమంలో సర్పంచుల ఛాంబర్ మండల అధ్యక్షుడు ఏలేటి చిన్న తుక్కయ్య, మారిశెట్టి శ్రీను, సొంగ రాకేష్, మహిళా నాయకులు పాల్గొన్నారు.

అణగారిన వర్గాల అభ్యున్నతికే తొలి ప్రాధాన్యత


సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల భవనాలను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే వీఆర్ ఎలీజా

చింతలపూడి : విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో పెట్టుకుని సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల విద్యార్థులను రెండు నెలల్లో నూతన భవనాల్లోకి తరలిస్తామని ఎమ్మెల్యే ఉన్నమట్ల ఎలీజా తెలిపారు. మంగళవారం చింతలపూడిలో నిర్మాణంలో ఉన్న సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల భవనాలను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతు గతంలో టీడీపీ హయాంలో వందలాది మంది ఎస్సీ విద్యార్థుల కోసం మంజూరైన గురుకుల పాఠశాల భవనాలకు నిధులు మంజూరు చేయలేదని ఆరోపించారు. దివంగత నేత డా వైఎస్ రాజశేఖరరెడ్డి హయాంలో గురుకుల పాఠశాల మంజూరైందని, అప్పట్లో మార్కెట్ కమిటీ భవనాల్లో గురుకుల పాఠశాలను తాత్కాలికంగా ప్రారంభించారని తెలిపారు. ఏళ్ల తరబడి విద్యార్థులు రేకుల షెడ్లుల్లో నివసిస్తున్నారని వాపోయారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక భవనాల నిర్మాణానికి కావాల్సిన నిధులను మంజూరు చేసినట్లు చెప్పారు. ప్రభుత్వం ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ విద్యార్థుల చదువు కోసం మొదటి ప్రాధాన్యత ఇస్తున్నట్లు చెప్పారు. అధికారులు కూడా అందుకు అనుగుణంగా అవినీతి రహితంగా పనిచేయాలని అన్నారు. భవనాలను పూర్తి చేయడంతో పాటు విద్యార్థులకు కావలసిన మౌలిక వసతులను సమకూర్చడానికి చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఆయన వెంట ఉన్నమట్ల ఝాన్సీరాణి, పట్టణ వైఎస్సార్ సీపీ కన్వీనర్ కొప్పుల నాగేశ్వరరావు, వైస్ ఎంపీపీ సాదరబోయిన వరలక్ష్మి, సర్పంచ్ కె యువరాజు, ప్రసాద్‌రాజు, ఎంఈఓ రామారావు తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలి


ద్వారకాతిరుమలలో అంగన్‌వాడీ విద్య గురించి పిల్లల తల్లులకు వివరిస్తున్న సూపర్‌వైజర్ మేరి

ద్వారకాతిరుమల: ఐసీడీఎస్ జంగారెడ్డిగూడెం ప్రాజెక్టు పరిధిలోని ద్వారకాతిరుమల సెక్టారులో జన భగీదారీ కార్యక్రమాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రీస్కూల్ అభివృద్ధి గురించి, అలాగే పిల్లల మానసిక, శారీరక ఎదుగుదల, భాషా, సాంఘికాభివృద్ధి, గణితాభివృద్ధి, సంసిద్ధత తదితర అంశాలను పిల్లల తల్లిదండ్రులకు జీఎంఎస్‌కే సూపర్‌వైజర్ మేరి క్షుణ్ణంగా వివరించారు. అంగన్‌వాడీ కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

కొయ్యలగూడెం : పొంగుటూరు సెక్టార్ పరిధిలో పీవో స్వర్ణకుమారి ఆధ్వర్యంలో అంగన్‌వాడీ కేంద్రాలలో మంగళవారం జనభగీదారీ కార్యక్రమం నిర్వహించారు. ప్రథమ థీమ్ కోఆర్డినేటర్ కృష్ణ మూడు నుంచి ఆరేళ్ల పిల్లల శారీరక అభివృద్ధి, సాంఘిక అభివృద్ధి, భాషాభివృద్ధి, మేధాభివృద్ధి, సృజనాత్మక పిల్లల సమగ్ర అభివృద్ధికి ఉపయోగపడే అంశాలను వివరించారు. అనంతరం అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్ అంబటి సరస్వతి సెక్టార్ పరిధిలోని కార్యకర్తలు సిబ్బంది చిన్నారుల తల్లులు పాల్గొన్నారు.

కామవరపుకోట : బడి ఈడు పిల్లల సమగ్ర అభివృద్ధికి అంగన్‌వాడీ కేంద్రాలు ఎంతో ఉపయోగపడతాయని తడికలపూడి సెక్టార్ అంగన్‌వాడీ సూపర్‌వైజర్ వీరకుమారి అన్నారు. మంగళవారం కళ్ళచెరువు గ్రామంలో జనభగీదారీ కార్యక్రమంలో భాగంగా పిల్లల తల్లులకు అవగాహన కల్పించి ర్యాలీ నిర్వహించారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో పిల్లలకు కల్పించే సదుపాయాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ ఎన్.శ్రీదేవి, మహిళా పోలీస్ కె.వెంకటేశ్వరమ్మ, సుబ్బలక్ష్మి, సరళ, విజయ, గంగ తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ భద్రతా నియమాలు పాటించాలి


సమావేశంలో మాట్లాడుతున్న ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ కేఎం అంబేద్కర్

జంగారెడ్డిగూడెం : విద్యుత్ భద్రతా నియామాలపై సిబ్బంది అవగాహన పెంచుకుని, తూ.చ తప్పకుండా పాటించడం ద్వారా ప్రమాదాలను నివారించవచ్చని ఏపీఈపీడీసీఎల్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ కేఎం అంబేద్కర్ అన్నారు. జంగారెడ్డిగూడెం ఆలపాటి గంగా భవానీ కళ్యాణ మండపంలో ఏపీఈపీడీసీఎల్ ఆధ్వర్యంలో విద్యుత్ ప్రమాదాల నివారణపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సదస్సులో కేఎం అంబేద్కర్ మాట్లాడుతూ మరమ్మతులు చేసే సమయంలో సిబ్బంది హెల్మెట్లు, సేఫ్టీ బెల్టులు వినిగించాలని, స్తంభాలపై ఉన్నప్పుడు ఫోన్ మాట్లాడవద్దని సూచించారు. గాలివానకు వర్షాకాలంలో ఎప్పుడైనా వైర్లు తెగిపోయిన, విద్యుత్ పరివర్తకముల దగ్గర ఏదైనా ప్రమాదం జరిగిన వెంటనే విద్యుత్ సిబ్బందికి సమాచారం అందించే విధంగా ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. డీఈఈలు యు.సుబ్బారావు, టి.వెంకట్రావు, ఏఈలు ఎం.జోసెఫ్, ఎస్.శ్రీనివాస్, డి.గోలునాయక్, సిబ్బంది పాల్గొన్నారు.

కొయ్యలగూడెం : రేపల్లెవాడ రోటరీ ఫంక్షన్ హాల్‌లో జంగారెడ్డిగూడెం డివిజన్ పరిధిలోని అధికారులకు, సిబ్బందికి విద్యుత్తు భద్రతపై మంగళవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న జంగారెడ్డిగూడెం ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ అంబేద్కర్ మాట్లాడుతూ విద్యుత్ భద్రతపై అవగాహన తప్పనిసరి అన్నారు. 33 కేవీ లైన్, 11 కేవీ లైన్, ఎల్‌టీ లైన్, డీటీఆర్ సర్వేల మీద వివరించారు. షిఫ్ట్ ఆపరేటర్లు మొదలుకొని జూనియర్ లైన్‌మన్‌లు, లైన్‌మన్‌లు, ఎల్ఐలు అదేవిధంగా ఏఈలు ప్రభుత్వం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఈ కార్యక్రమాన్ని ప్రజల్లోకి వెళ్లాలన్నారు. డీఈ బీవీ గోపాలకృష్ణ, కొయ్యలగూడెం, బుట్టాయిగూడెం, బయ్యన్నగూడెం ట్రాన్స్‌కో ఏఈలు ఎస్‌వీ రామారావు, వర్మ, వైఆర్ఆర్ మోహన్ రావు, డి ఇందిరా కుమారి సిబ్బంది పాల్గొన్నారు.

వరుస దొంగతనాలతో బెంబేలు

కుక్కునూరు : మండలంలోని అల్లిగూడెం, పెద్దరావిగూడెం నర్సరీలలో వరుస దొంగతనాలు నర్సరీ యజమానులకు కంటిపై కునుకు లేకుండా చేస్తున్నాయి. నర్సరీల ఆవరణలో బిగించిన మోటార్లు, సోలార్ ఇతర ఎలక్ట్రికల్ వస్తువులే లక్ష్యంగా దొంగతనాలు జరుగుతున్నాయంటూ నర్సరీ యజమానులు ఆరోపిస్తున్నారు. సోమవారం భువనగిరి గ్రామంలోని ఎల్లంకి రామారావుకు చెందిన నర్సరీలో సోలార్ త్రీఫేస్ డ్రైవ్ చోరీకి గురైంది. దాని విలువ దాదాపు రూ.30 వేల వరకు ఉంటుందని బాధితుడు తెలిపారు. గతంలో అదే ప్రాంతంలో పలువురి నర్సరీల్లో మోటర్‌లు చోరీకి గురైయ్యాయని స్థానికులు తెలిపారు. కాగా వరుస దొంగతనాల విషయమై బాధితులు మంగళవారం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయనున్నట్లు చెప్పారు.

ఎస్ఈబీ దాడులు

చింతలపూడి : చింతలపూడి ఎస్ఈబీ స్టేషన్ పరిధిలో కామవరపుకోట, ఆడమిల్లి, వడ్లపల్లి , నాగిరెడ్డిగూడెం గ్రామాల్లో మంగళవారం దాడులు నిర్వహించినట్లు ఎస్ఈబీ ఇనెస్పెక్టర్ సుంకర సాయి స్వరూప్ తెలిపారు. కామవరపుకోటలో చలమల కోటేశ్వరరావును అరెస్టు చేసి అతని వద్ద నుంచి 5 లీటర్ల సారా, జంపాని పాల్‌రాజు, చలమాల వెంకటేశ్వరరావులను అరెస్టు చేసి వారి నుంచి 20 లీటర్ల సారా స్వాధీనం చేసుకున్నామన్నారు. అలాగే 600లీటర్ల బెల్లపు ఊటను ధ్వంసం చేశామన్నారు. ఆడమిల్లిలో నల్లమెల్లి మోహనరావు, మురుదొడ్డి నాగబాబులను అరెస్టు చేసి వారి నుంచి 15లీటర్ల సారా, నాగిరెడ్డిగూడెంలో వడిత్య జయరామ్‌ను అరెస్టు చేసి అతని వద్ద నుంచి తెలంగాణకు చెందిన ఎన్‌డీపీఎల్ మద్యాన్ని స్వాధీనం చేసుకున్నామన్నారు.

యువతి అదృశ్యంపై కేసు నమోదు

జంగారెడ్డిగూడెం : యువతి అదృశ్యంపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై ఎం.సాగర్‌బాబు తెలిపారు. వివరాల ప్రకారం శ్రీనివాసపురానికి చెందిన యువతి జంగారెడ్డిగూడెంలోని ఓ బట్టల దుకాణంలో కంప్యూటర్ ఆపరేటర్‌గా పనిచేస్తోంది. ఈ నెల 12వ తేదీన అనారోగ్యంగా ఉందని షాపు నుంచి బయటకు వెళ్లిన ఆమె ఇంటికి రాలేదు. స్నేహితులు, బంధువుల ఇంటి వద్ద వెతికినా ఆచూకీ లభించకపోవడంతో మంగళవారం యువతి తండ్రి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. బయ్యనగూడెంకు చెందిన మేకల రమేష్‌పై అనుమానం ఉన్నట్లు ఫిర్యాదులో పేర్కొన్నాడు.

జూదరుల అరెస్ట్

ద్వారకాతిరుమల: దొరసానిపాడు గ్రామ పొలాల్లో నిర్వహిస్తున్న పేకాట స్థావరంపై మంగళవారం సాయంత్రం పోలీసులు దాడి చేశారు. నలుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకుని, వారివద్ద నుంచిరూ. 7,200, 52 పేక ముక్కలను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై టి.సుధీర్ తెలిపారు.

దౌర్జన్యంపై కేసు నమోదు

జంగారెడ్డిగూడెం : తనకు ఉన్న జిప్లస్‌టు బిల్డింగ్‌ను స్కూల్ నిర్వహణ నిమిత్తం ఊరకరణం జగన్నాధరావు(జగన్) అనే వ్యక్తి అద్దెకు తీసుకున్నాడని, ఖాళీ చేయాలని అడిగితే దౌర్జన్యం చేస్తున్నాడని కొనకళ్ల నాగేశ్వరరావు గుప్త మంగళవారం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. దీనిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

తాటాకిల్లు దగ్ధం

జంగారెడ్డిగూడెం రూరల్ : పేరంపేటలో ఓ తాటాకిల్లు దగ్ధమైంది. వివరాల ప్రకారం కొట్రా నరసయ్య కుటుంబం గ్రామ శివారులోని పొలంలో తాటాకిల్లు నిర్మించుకుని జీవిస్తున్నారు. మంగళవారం పక్క రైతుల పొలాల్లో తుక్కు తగులపెడుతుండగా నిప్పు రవ్వలు చెలరేగి నరసయ్య పాకపై పడటంతో మంటలు చెలరేగాయి. తాటాకింటిలో ఉన్న గ్యాస్ బండ పేలడంతో పెద్ద ఎత్తున్న మంటలు వ్యాపించి ఇల్లు దగ్ధమైంది. ఇంటిలో ఉన్న నగదు, దుస్తులు, గృహోపకరణాలు కాలిబూడిదైనట్లు నరసయ్య తెలిపారు.

స్టడీ సర్కిల్ భవన నిర్మాణ ప్రతిపాదిత స్థల పరిశీలన


స్థలాన్ని పరిశీలించి అధికారులతో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్

చింతలపూడి : చింతలపూడి తుక్కులూరు హేబిటేషన్‌లో చేపట్టబోయే స్టడీ సర్కిల్ భవన నిర్మాణానికి ప్రతిపాదించిన స్థలాన్ని మంగళవారం జిల్లా కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ పరిశీలించారు. ప్రభుత్వ భూమి య 4.72 సెంట్లలో ఆర్ఎస్ఆర్ ప్రకారం 45 సెంట్ల రహదారి గురించి రోడ్లు, భవనాల శాఖ, రెవెన్యూ శాఖ అధికారులతో కలెక్టర్ చర్చించారు. మేఘా ప్రాజెక్టు ద్వారా నిర్మించే స్టడీ సర్కిల్ భవనం ప్లాన్‌ను ఆర్అండ్‌బీ ఎస్ఈ జి జాన్ మోషే కలెక్టర్‌కు వివరించారు. స్థలానికి సంబంధించిన రోడ్డు, తదితర అంశాలపై స్థానిక అధికారులకు కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ సూచనలు చేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ కృష్ణజ్యోతి, మండల సర్వేయర్ తులసి, ఎస్ సుందర్రావు, ఆర్ఐ కాంతారావు, మేఘన ప్రాజెక్టు అధికారులు పాల్గొన్నారు.

దివ్యాంగులకు పరికరాల గుర్తింపు

టి.నరసాపురం : స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో ఏలూరు జిల్లా దివ్యాంగుల పునరావాస కేంద్రం ఆధ్వర్యంలో మంగళవారం దివ్యాంగుల గుర్తింపు శిబిరం (సదరన్ క్యాంపు) నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా దివ్యాంగుల పునరావాస కేంద్రం కో–ఆర్డినేటర్ డి.శ్రీనివాస రెడ్డి మాట్లాడుతూ దివ్యాంగులను పరీక్షించి, వారికి అవసరమైన పరికరములను గుర్తించి, వాటిని అందించడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో 36 మంది దివ్యాంగులను పరీక్షించి, వారికి వివిధ పరికరాలను గుర్తించడం జరిగిందన్నారు. జిల్లా దివ్యాంగుల పునరావాస కేంద్రం సిబ్బంది, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

కుట్టు మెషీన్ల పంపిణీ

జంగారెడ్డిగూడెం రూరల్ : మండలంలోని శ్రీనివాసపురంలో హోప్‌మినిస్ట్రీస్ సంస్థ ఆధ్వర్యంలో 50 కుట్టు మెషీన్లను మంగళవారం పంపిణీ చేశారు. జెడ్పీటీసీ పోల్నాటి బాబ్జి, సర్పంచ్ పోల్నాటి శ్రీనివాసరావు, ఎంపీటీసీ జుజ్జవరపు తాతారావు చేతుల మీదుగా మహిళలకు కుట్టు మెషీన్లు అందజేశారు. ఈ సందర్భంగా జెడ్పీటీసీ బాబ్జి మాట్లాడుతూ మహిళలు కుట్టుమెషీన్లు, చేతివృత్తులను నేర్చుకుని ఆర్థిక స్వావలంభన దిశగా పయనించాలన్నారు. కార్యక్రమంలో హోప్ మినిస్ట్రీస్ సంస్థ నిర్వాహకులు శామ్యూల్ జాషువా, వైఎస్సార్ సీపీ నాయకులు పోల్నాటి రాజా, పోల్నాటి రాజు, వార్డు సభ్యులు పాల్గొన్నారు.

ప్రభుత్వ సొమ్మును రికవరీ చేయాలని కలెక్టర్‌కు ఫిర్యాదు

చింతలపూడి : ఖమ్మం – దేవరపల్లి గ్రీన్‌ఫీల్డ్ హైవే నిమిత్తం సేకరించిన ప్రభుత్వ భూమికి అక్రమంగా నష్టపరిహారం పొందిన వ్యక్తుల నుంచి సొమ్మును ప్రభుత్వం రికవరీ చేయాలని రైతులు ఫిర్యాదు చేశారు. సోమవారం జరిగిన స్పందన కార్యక్రమంలో ఏలూరు జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదును అందచేసినట్లు రైతులు తెలిపారు. ఈ సందర్భంగా ఆయకట్టు రైతు నాయకులు కొమ్మిన వెంకటేశ్వరరావు, కేవీపీ మల్లికార్జునరావు వివరాలు వెల్లడించారు. చింతలపూడి మండలం, తీగలవంచ గ్రామంలో 1960లో మేడుకొండూరి జగన్నాధరావు సర్వేంబర్ 149–సి లో 6.74 ఎకరాల సొంత చెరువును తవ్వించారు. సదరు చెరువు కింద ఉన్న ఆయకట్టు రైతులకు సాగు నీరు పారించుకుని ప్రభుత్వానికి శిస్తు చెల్లించుకునే విధంగా రేచర్ల గ్రామానికి చెందిన వేముల సర్వయ్య, గుంటు వెంకన్నల పేరుతో కండీషన్ క్రయ దస్తావేజు వ్రాసి ఇచ్చారు. చెరువుకు సావరపు కట్ట చెరువు అని నామకరణం చేసి చెరువుపై సర్వ హక్కులు ప్రభుత్వానికి చెందే విధంగా రాసి ఇచ్చారు. ఇటీవల గ్రీన్‌ఫీల్డ్ హైవే కోసం 1.42 ఎకరాలు భూసేకరణలో సేకరించారు. వేముల సర్వయ్య గుంటు వెంకన్నలు మృతి చెందటంతో సర్వయ్య కుమారుడు వెంకటేశ్వరరావు పేరుతో రెవెన్యూ అధికారులు రికార్డుల్లో నమోదు చేయడంతో గ్రీన్ ఫీల్డ్ రహదారి కోసం ప్రభుత్వం రూ.29 లక్షల 17 వేల 109 చెల్లించినట్లు ఆరోపిస్తున్నారు. రెవెన్యూ అధికారులు రికార్డులు పరిశీలించకుండా రికార్డుల్లో నమోదు చేయడం వల్లనే ప్రభుత్వ సొమ్ము దుర్వినియోగమైనట్లు చెప్పారు. జిల్లా అధికారులు సమగ్ర విచారణ జరిపి సొమ్మును రికవరీ చేయాలని విజ్ఞప్తి చేస్తున్నారు.